# పాపపరిహారం!

* రచన : శ్రీ బచ్చు వీర్రాజు *



(రచయిత)

"రాజ్ అండ్ రాజ్ ఎంటర్‌ప్రైజెస్"కు అసిస్టెంటు మేనేజర్స్ సెలక్షన్ ఆ రోజే జరుగుతోంది.

నేను జనరల్ మేనేజర్ హోదాలో వుండి, ఫైనల్ సెలక్షన్‌లో పూర్తి హక్కు, బాధ్యతలు కలిగివున్నాను.

ఆఫీసంతా హడావుడిగా వుంది. ఇంటర్వ్యూ మొదలైంది. పురుషులతోబాటు, స్త్రీలుకూడా హాజరయ్యారు. డిగ్రీగల వాళ్ళంతా అర్హులే అన్న నియమంతో, చాలామంది వచ్చారు.

X X X

ఒక్కొక్కరే నెమ్మదిగా, నిరాశగా వెనుతిరిగి పోతున్నారు. ఇంతలో 'ఈశ్వర్, బి.ఏ., అని పిలిచాను. ప్యూన్. వెంటనే బయటకువెళ్ళి, అదే పేరుతో నాలుగుసార్లు పిలిచాడు. రెస్పాన్స్ లేకపోవడంతో అతను లోపలికివచ్చి 'ఆ వ్యక్తి రాలేదు సార్!' అని చెప్పడంతో మరోపేరును ఉచ్చరించాను.

ఇంటర్వ్యూ యింకో పది నిముషాల్లో ముగుస్తుందనగా, ఓ వ్యక్తి ఆదరా బాదరాగా లోపలికొచ్చాడు. డైరెక్టర్స్ అంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోతూ అతనివంక చూశాం.

అతని వాలకం జబ్బుపడి లేచిన వాడిలా వున్నాడు. బట్టలు నలిగిపోయి, ముఖం కాంతివిహీనంగా వుంది.

తన పేరు ఈశ్వర్ అనీ, కొన్ని అనివార్య కారణాల వల యింటర్వ్యూకు రావడం ఆలస్యమైందనీ వాపోయాడు.

నేనేమీ మాటాడకుండా యింటర్వ్యూ మొదలుపెట్టాను. ప్రశ్నలన్నిటికీ ఎంతో యుక్తిగా, చక్కగా విపులీకరిస్తూ చెబుతున్నాడు.

కొన్ని క్షణాలు గడిచాయి! ఇంతలో నేను గొంతు సవరించుకొని 'చూడు మిస్టర్! నీ అర్హతలన్నీ బాగానే వున్నాయి. కానీ నువ్వు యింటర్వ్యూకు రావడంలో పంక్చ్యువాలిటీని విస్మరించావు! అది నీ నిర్లక్ష్యానికి కొలమానికగా తీసుకోబడుతుంది. అందుచేత...సారీ నిన్ను సెలెక్టుచెయ్యలేక పోతున్నాం' అంటూ లేచి నిలబడ్డాను.

ఆ మాటకు ఒక్కసారిగా అతని కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి! లేచి నమస్కరిస్తూ బయటకు భారంగా దారితీశాడు.

X X X

మేమంతా ఒక్కసారిగా లేచి నిలబడేసరికి, ఓ వ్యక్తి హడావుడిగా స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని లోపలకు అడుగు పెట్టాడు.

ఆ వ్యక్తి మా ఫామిలీ డాక్టర్ ప్రసాద్! నేను కంగారుగా చూశాను. అతను నన్ను సమీపించి 'చూడు రాజా యిప్పుడు బయటకు వెళ్ళిపోయిన వ్యక్తి యింటర్వ్యూకు వచ్చిన అభ్యర్థుల్లో ఒకడా? అని ప్రశ్నించాడు.

దానికి నేను 'అవును!' అన్నాను నెమ్మదిగా తలవూపి.

ఓ మై గాడ్! ఈ రోజు ఆ వ్యక్తిగనుకే లేకపోతే నీ ముద్దుల కొడుకు హరి ప్రాణాలు గుటుక్కుమనేవి. రోడ్ మీద లారీ ప్రమాదంనుంచి రక్షించి, నీ హరికి రక్తం యిచ్చి ప్రాణాపాయంనుంచి కాపాడాడు. తొందరగా వెళ్ళి నీ ఋణం తీర్చుకో!' అంటూ ప్రసాద్ తొందర చేశాడు.

నేను ఒక్కసారిగా షాక్ తిన్నట్లు ఫీలయ్యి ప్యూన్‌వంక చూశాను. నా చూపులర్థంచేసుకున్న ప్యూన్ కంగారుగా బయటకు పరిగెత్తాడు.

X X X

కొన్ని క్షణాలు గడిచాయి. డైరెక్టర్లంతా ఆశ్చర్యంగా అలాగే నిలడిపోయారు. ఇంతలో ప్యూన్ ఈశ్వర్ చేయి పట్టుకొని లోపలకు తీసుకొచ్చాడు.

నేను గద్గదస్వరంతో 'చూడు ఈశ్వర్ నీ ఇంటర్వ్యూకు అయిన ఆలస్యం వెనుక ఇంతటి కథ దాగివున్నట్లు ఇప్పుడే తెల్సింది. నీ ప్రాణాలొడ్డి, నా ఒక్కగానొక్క కొడుకును కాపాడావు. దానికి కృతజ్ఞతగా అన్ని అర్హతలూవున్న నీకు యీ అసిస్టెంట్ మేనేజర్ పోస్టు ఖాయం చేస్తున్నాను" అన్నాను భుజంతట్టి.

ఆ వ్యక్తి ఒక్కసారిగా నా పాదాలమీదకు వాలిపోయి కళ్ళంబట నీళ్ళు జలజలా రాలుస్తూ.

నేను ప్రసాద్ భుజంతట్టి డైరెక్టర్స్‌కు వీడ్కోలు చెప్పి, ప్రసాద్‌తో హాస్పిటల్ వైపుకు దారితీశాను.

